

# కలకంఠి కథలు

## - శ్రీధర



ఈ కథల గురించి:

*1992లో ఈనాడులో వసుంధర పేజీ ప్రారంభించారు. స్త్రీలకు సంబంధించిన అంశాల కోసం. రామోజీరావు గారి సూచనలతో ఎడిటర్ వర్మగారు ప్రతి గురువారం ఒక వుమన్ ఓరియెంటెడ్ ఆర్టికల్ ఉండాలని నిర్ణయించారు. అప్పటికే శ్రీధర విష్ణుప్రియ కాలమ్ రాస్తున్నారు. అందుచేత స్త్రీలకు ఆసక్తికరంగా ఉండే ఒక ఆర్టికల్ రాయమని శ్రీధరని అడిగారు. మర్నాడు ఆర్టికల్ రాసిచ్చారు. దానిపేరు 'అమ్మకు ఎన్నడన్నా థాంక్స్ చెప్పారా?', బాగానే ఉందనిపించినా, రెస్పాన్స్ ఎలా ఉంటుందో నన్న చిన్న అనుమానం వర్మగారికి ఉండనే ఉంది. కానీ ఆ రాత్రి కంపోజింగ్ చేసినవాళ్లూ, పేజీ మేకప్ చేసినవాళ్ళు 'ఆగి, కళ్లు తుడుచుకున్నాం 'అని చెప్పినప్పుడు ఆయన అనుమానం నివృత్తి అయింది. అచ్చయ్యాక, చదివిన ప్రతివాళ్లూ, అవునూ, మా అమ్మ మా కోసం ఎంతో చేసింది, థాంక్స్ చెప్పాలన్న ఆలోచనే రాలేదు ' అని అన్నారు. తర్వాత వరసగా నాలుగు వారాలు ఇంకా ఎన్నాళ్లు నాకీ సంకెళ్ళు? 'దయచేసి అనాగరికుల అడ్రస్ చెప్పండి, 'ఇల్లాలి హృదయవేదనా నివేదన 'రాశారు. అనూహ్యమైన స్పందన వచ్చింది. 'నేను వ్యాసాలు రాయించాలనుకున్నాను, మీరు రాసిన వ్యాసాలు కథల్లానే ఉంటున్నయి, ఇంక కథలే రాయండి...' అన్నారు వర్మగారు. స్త్రీలకు సంబంధించిన పేజీ కనుక 'మల్లిక' పేరుతో ప్రతి గురువారం ఒకటి కాదు, రెండు కాదు నాలుగు వందల ఆణిముత్యాల్లాంటి కథలు ఒక దశాబ్దం పాటు ఏకబిగిన రాశారు. చాలా మందికి ఎవరీ మల్లిక, అన్న ప్రశ్న ఎదురైంది. ఈనాడుకు ఫోన్ కాల్స్ చేసినవారిలో ఎంతో మంది ప్రముఖులూ ఉన్నారు.*

*ఎందరో సాహిత్యాభిమానులను గురువారం ఉదయం కోసం వసుంధర పేజి కోసం ఎదురు చూసేలా ఆసక్తి కలిగించిన శ్రీధర (మల్లిక) కథలు, కౌముది పాఠకుల కోసం ముఖ్యంగా నవతరం కోసం... ప్రతి నెలా.. చదవండి.!!*

# అద్దం

పోస్టువాడి కేక వినపడింది. సీతాపతి వెళ్ళి లెటర్ అందుకున్నాడు.

భానుమతిని పదో తేదీన ఇంటర్వ్యూ కు రమ్మని ఒక ప్రముఖ కంప్యూటర్ కంపెనీ వాళ్ళు పంపిన లెటర్ అది.

సీతాపతి సంతోషంతో అన్నాడు " భానూ, నీకు ఇంటర్వ్యూ కి పిలుపు వచ్చింది. నక్కను తొక్కి నట్లున్నావు "

"నక్కను తొక్క లేదు, కుక్కను తొక్క లేదు. కష్టపడి చదువు కున్నాను. అప్లయి చేసాను. పిలుపు వచ్చింది." అన్నది భానుమతి.

"నేనొక పని చేస్తాను. ఈ కంపెనీ లో జాబ్ రావాలంటే ఎవరిని పట్టుకోవాలో ప్రయత్నం చేస్తాను." అన్నాడు సీతాపతి.

మొత్తం మీద రెండు రోజుల్లో ఒక సోర్స్ పట్టుకున్నాడు. తన ఫ్రెండు కు తెలిసిన ఒక పెద్ద మనిషి చేత చెప్పిస్తే జాబ్ వచ్చినట్లే అని తెలుసుకున్నాడు.

అందుచేత ఆ ఫ్రెండు ను పట్టుకుని ఆ పెద్ద మనిషి ఇంటి చుట్టూ తిరిగి ఎలాగో ఆయన్ను కలుసుకున్నాడు. ఆ పెద్ద మనిషి ఆ కంపెనీ యం.డి. కి ఫోను చేసాడు. కాని ఆయన అంద లేదు. అందు చేత తన లెటర్ హెడ్ మీద "ఈ అమ్మాయికి హెల్ప్ చెయ్యి" అని ఒక ముక్క రాసి ఇచ్చాడు.

ఈ మాత్రం లెటర్ సంపాదించ గలిగి నందుకు సంతోషించాడు.

"ఇంకేం ఫర్వాలేదు, ఈ ఉత్తరం పాశుపతాస్త్రం. ఉద్యోగం వచ్చి నీ వొళ్ళొ వాలుతుంది." అన్నాడు సీతాపతి భానుమతితో.

పదోతేది ఉదయం ఆమెను ఆ అఫీసు ముందు దించాడు.

"ఇంటర్వ్యూ అయినాక మా అన్నయ్య గారి ఇంటికి వచ్చెయ్. అందరం అక్కడే ఉంటాం. శుభ వార్త వినటానికి " అన్నాడు సీతాపతి.

భానుమతి లోపలికి వెళ్ళింది. ఇంటర్వ్యూ కి వచ్చిన వాళ్ళంతా ఒక వరుసగా కుర్చీల్లో కూర్చుని వున్నారు. భానుమతి పక్కన కూర్చున్న ఒకామె పలకరించి మాటలు కలిపింది.

"బోలెడు డబ్బు పోసి ఈ కంప్యూటర్ కోర్సులు నేర్చుకున్నాం. దానికి చేసిన అప్పుకు వడ్డీ లు కట్టలేక చస్తున్నాం. ప్రతి వాళ్ళూ అనుభవం కావాలంటారు. ఇంటర్వ్యూలకు తిరగలేక విసుగు వస్తున్నది." అన్నది ఆమె.

ఒంటి గంట దాకా వీళ్ళను పిలవ లేదు. లంచ్ టైం అయింది. రెండు గంటల తరువాత రమ్మన్నారు.

భానుమతి, ఆమెకు పరిచయం అయిన దమయంతి ఇద్దరూ కాంటీన్ కు వచ్చారు. అక్కడ దమయంతి తన గోడు వెళ్ళబోసుకుంది.

"నా భర్త యాక్సిడెంట్ లో చనిపోయాడు. ఆయన ఉన్నంత కాలం నాకు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేక పోయింది. ఆయన పోయాక కుటుంబ బాధ్యత నా మీద పడింది. ఉద్యోగం వెతుక్కొక తపనిసరి పరిస్తితి ఏర్పడింది.." అన్నది దమయంతి.

భాను బిల్లు చెల్లించింది. ఇద్దరూ మళ్ళీ పైకి వెళ్ళారు. భానుమతి గాజు తలుపుల లో నుంచి బయటకు చూస్తున్నది. పర్సు తెరిచి అందులో వున్న చిన్న పగిలిన అద్దం ముక్కలో నుంచి తన ముహం చూసు కుంది. ఇదీ అద్దమే. ఆ అద్దం లో నుంచి చూస్తే రోడ్డు మీద వెళ్తున్న ఇతరులు కనిపిస్తున్నారు. అద్దానికి స్వార్ధం అనే కళాయి పూస్తే మన ముహమే అందులో కనిపిస్తుంది గాని ఇతరులు కనిపించరు.

భాను బ్యాగ్ తెరిచి అందులో నుంచి తను తెచ్చు కున్న రికమండేషన్ దమయంతి కి ఇచ్చింది.

"మిమ్మల్ని ఇంటర్వ్యూ కి పిలిచినప్పుడు లొపలకు వెళ్ళాక అక్కడ ముఖర్జీ అని ఒక ఆయన ఉంటారు. ఆయనకు ఈ లెటర్ ఇవ్వండి. మీకు ఉద్యోగం వస్తుంది." అని చెప్పింది భానుమతి.

భానుమతి ఇంటికి వచ్చింది. భానుమతి కి ఉద్యోగం వచ్చినట్లే నని సీతాపతి అందరి కి చెబుతున్నాడు. అందరూ భోజనాలు చేసాక ఒక చోట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

మరదలు వచ్చి చెప్పింది భానుమతి తో. "వదినా నీ పర్సు లో నుంచి ఇరవై రూపాయలు తీసుకున్నాను. కానీ నీ పర్సు లో పగిలి పోయిన అద్దం ముక్క ఉందేమిటి ? గుచ్చు కోదూ ?" అన్నది.

"అదా, ఆ అద్దంతో చిన్నప్పుడు నేను ఆడుకునేదాన్ని. ఎండ లో నిలబడి అద్దం మీద పడిన సూర్య కిరణాలు చీకటిగా నున్న గది లోకి రిఫ్లెక్ట్ అయ్యేలాగా చేసి అనందించేదాన్ని. చీకటి లో ఉన్నవాళ్ళ మీద వెలుతురు పడేలా చేసేదాన్ని. నాకు అదో ఆట. నా పెళ్ళికి ముందే అద్దం పగిలి పోయింది. చిన్న ముక్కను మాత్రం భద్రంగా దాచుకున్నాను. అదొక సెంటిమెంట్. సెంటిమెంట్స్ లేకపోతే మనుషులకూ పశువులకూ తేడా ఏముంది ? " అన్నది భానుమతి.

ఆమె చెప్పింది పూర్తిగా అర్ధం కాక పోయినా, అర్ధం అయినట్లు తల ఊపింది మరదలు.

★★★★★★★★★★★★

(వచ్చేనెల మరో కథ)

Click here to share your comments on this story.